సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 22 । జూలై । 2024



వర్షాలకు రొయ్య విలవిల

ఎడతెరపిలేని వర్షాలు ఆక్వా పరిశ్రమను ముంచేశాయి. ముఖ్యంగా రొయ్య రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.


8లో



10 కిలోల వెండి చోరీ

కైకలూరులోని ఓ ఇంట్లో దొంగలు పడి సుమారు 10 కిలోల వెండిని చోరీ చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

8లో



మీ మెదడు పదిలం

జీవితంలో అద్భుతాలు చేసే మెదడును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. నేడు ప్రపంచ మెదడు దినోత్సవం.

8లో

న్యూస్‌రీల్

ముంపు చేల పరిశీలన



మొగల్లులో రైతులతో మాట్లాడుతున్న జేడీ వెంకటేశ్వరరావు

పాలకోడేరు : నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గరగపర్రు, మొగల్లు కోరుకొల్లు గ్రామాల్లో నీట మునిగిన నారుమడులు, ఊడ్చిన వరిచేలను ఆదివారం వ్యవసాయ సంయుక్త సంచాలకుడు జెడ్.వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు తగ్గిన తర్వాత ముంపు నీరు బయటకు తోడి ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల కార్బనిజం ముందును పిచికారీ చేయాలని, ఎంఓపీ, కిలో యూరియా చల్లుకోవడం ద్వారా మడులను కాపాడుకోవచ్చన్నారు. నారుమడులు కుళ్లిపోతే స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 11 21, ఎంపీయూ 1156, ఎంటీయూ 1153 విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుందన్నారు. వ్యవసాయ అధికారి వి.నారాయణరావు మాట్లాడుతూ మండలంలో 90 ఎకరాల్లో నారుమడులు, 300 ఎకరాల ఊడ్చిన చేలు నీటమునిగాయన్నారు.

ఎర్రకాలువలోకి 7,048 క్యూసెక్కుల నీరు

జంగారెడ్డిగూడెం రూరల్: భారీ వర్షాలకు జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీకరాటం కష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం గంటకు 7,048 క్యూసెక్కుల నీరు రాగా డ్యాం నాలుగు గేట్ల నుంచి గంటకు 7,250 క్యూసెక్కుల వరద నీటిని వదులుతున్నారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 81.40 మీటర్లకు నీటిమట్టం చేరిందని ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు.

జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక

దెందులూరు: దెందులూరు మండలంలోని గంగన్నగూడెం గ్రామానికి చెందిన సీఆర్‌డీఏ కార్యాలయం డివిజనల్ సర్వే అధికారి సొంగా రవీంద్రప్రసాద్ జాతీయ స్థాయి బంగారు నంది పురస్కారానికి ఎంపికయ్యారు. గంగన్నగూడెంలో రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ గౌతమేశ్వర గోసంరక్షణ సమితి విశ్వవిఖ్యాత ఆర్ట్ అండ్ కల్చరల్ అకాడమీ (హైదరాబాద్) త్యాగరాజు గానసభ రక్తదాన సేవా రంగంలో ఇచ్చే జాతీయస్థాయి బంగారు నంది అవార్డుకు తనను ఎంపిక చేశారన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాతకు విరాళం బాండ్ అందిస్తున్న ఈఓ

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు భీమవరం మండలం మందలపర్రుకు చెందిన పొట్టూరి నాగరామకృష్ణంరాజు ఆదివారం రూ.4 లక్షలను విరాళంగా అందజేశా రు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం విరాళం మొత్తాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈఓ వేంద్ర త్రినాథరావు దాతను సత్కరించి విరాళం బాండ్ అందజేశారు.

నేతల సిఫార్సు.. పోస్టింగ్‌కు ఎస్ బాస్

పోలీసు బదిలీల్లో పైరవీలు

- ప్రజాప్రతినిధుల సిఫార్సు ఉంటేనే పోస్టింగ్
- ఎమ్మెల్యేల వద్దకు క్యూ కట్టిన ఎస్సైలు, సీఐలు
- హైవే, ప్రధాన పోలీస్‌స్టేషన్లకు విపరీతమైన డిమాండ్
- భీమవరం టూటౌన్ సీఐ పోస్టుకు ఐదుగురు ఆశావహులు
- ఏలూరు రేంజ్‌లో 111 మంది ర్యాంకర్ ఎస్సైలకు బదిలీలు
- సీఐల బదిలీలకూ సన్నాహాలు
- సీఐ పోస్టుకు రూ.10 లక్షల పైమాటే
- మెట్ట ప్రాంతంలో భారీగా బేరసారాలు



సాక్షి ప్రతినిధి, ఏలూరు : పోలీస్ శాఖలో బదిలీల జాతర ప్రారంభమైంది. ఎస్పీల బదిలీలు పూర్తయితే కొత్త అధికారులు బాధ్యతలు తీసుకునే క్రమంలో ఎస్సైలు, సీఐల బదిలీల కోలాహలం ప్రారంభమైంది. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం కొలువు తీరడంతో ప్రజాప్రతినిధులు మండలంలో తహసీల్దార్లు మొదలుకొని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల వరకు అందరి బదిలీలపై దృష్టి సారించడంతో ఎస్సైలు, సీఐలు ప్రజాప్రతినిధుల వద్దకు క్యూ కడుతున్నారు. రకరకాల సిఫార్సులతో, భారీ పైరవీలతో పోస్టింగుల కోసం తంటాలు పడుతున్నారు. విజయవాడ కమిషనరేట్‌తో కలుపుకొని ఏలూరు పోలీస్ రేంజ్‌లోని మూడు ఉమ్మడి పోలీస్ జిల్లాల్లో మొత్తంగా 200 పోలీస్ సర్కిళ్లు ఉన్నాయి.

సీఐల బదిలీల హడావుడి

ఏలూరు రేంజ్‌లో సీఐల బదిలీల హడావుడి ప్రారంభమైంది. వాస్తవానికి పనితీరు, గతంలో కేసులు పరిష్కరించిన వైనం, రివార్డులు, అవార్డులు, చార్జి మెమోలు, మెమోలు ఇలా అన్ని అంశాలనూ పరిగణలోకి తీసుకుని పోస్టింగులు ఇస్తుంటారు. వీటన్నింటితో పాటు స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సు అనధికారికంగా తప్పనిసరి. ఈ పర్యాయం మాత్రం స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సు, సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేయడం, పైరవీలకు ప్రాధాన్యం ఇచ్చేలా బదిలీలకు తెరలేచినట్టు సమాచారం. ఇప్పటికే రేంజ్ పరిధిలోని 43 నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు రేంజ్ ఐజీకి సీఐ పోస్టింగుల కోసం భారీగా సిఫార్సు లేఖలు పంపారు. ఆయా జిల్లాల ఎస్పీలకు కూడా ఎస్సై పోస్టుల కోసం సిఫార్సు లేఖలు పంపారు. అన్నింటినీ పరిశీలించి బదిలీలు త్వరలో నిర్వహించనున్నారు.

మనోడైతే ఓకే

పార్టీకి అనుకూలంగా ఉండి, సంబంధిత ప్రజాప్రతినిధి సొంత సామాజికవర్గం గాని, లేదంటే ఆయా నియోజకవర్గంలో అత్యధిక ఓటింగ్ ఉన్న సామాజికవర్గానికి చెందిన సీఐ అయితే ఓకే. లేకపోతే వేరే స్టేషన్ చూసుకోవాలని ఎమ్మెల్యేలు ముఖం మీదనే చెబుతున్నారు. గతంలో మంచి పోస్టింగులు నిర్వహించినప్పటికీ తమకు అనుకూలంగా ఉంటే ఓకే, లేదంటే పోస్టింగే లేదని తేల్చిచెబుతున్నారు. ఇక సీఐ, ఎస్సై బదిలీలను అధికార పార్టీ చోటా నేతలు ఆదాయ వనరుగా మలుచుకున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతంలో ద్వితీయ శ్రేణి నేతలు ఆశావహులతో బేరసారాలు నిర్వహించి ఎమ్మెల్యేలతో ఖరారు చేయిస్తున్నారు. పోస్టింగ్‌కు సిఫార్సు లెటర్లు ఇస్తున్నారు. ఏలూరు జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో, కొల్లేరు ఉన్న మరో రెండు నియోజకవర్గాల్లో ఈ తరహా పైరవీలు జరుగుతున్నాయి. ఎస్సై పోస్టుకి సగటున రూ.5 లక్షలు, సీఐ పోస్టుకు సగటున రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు, జాతీయ రహదారి వెంబడి ఉండే సర్కిళ్లకు, కీలక ప్రాంతాల్లో అత్యధిక ఆదాయ వనరులు ఉన్న పోలీసు సర్కిళ్లకు స్పెషల్ రేట్లు పోలీసు వర్గాల్లో ప్రచారంలో ఉన్నాయి.

హైవేకు స్పెషల్ డిమాండ్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జాతీయ రహదారి అధికంగా ఉంది. జాతీయ రహదారిపై ఉండే దేవరపల్లి, నల్లజర్ల, నిడదవోలు, తణుకు, తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం రూరల్, కొవ్వూరు తదితర పోలీస్‌స్టేషన్లకు అత్యధిక డిమాండ్ ఉంది. ఒక్కో స్టేషన్‌కు సగటున ముగ్గురికి పైగా ఆశావహులు ప్రయత్నాల్లో ఉన్నారు. సంపన్న ప్రాంతంగా పేరున్న కొవ్వూరు, భీమవరం టూటౌన్‌కు విపరీతమైన డిమాండ్ ఉంది. ఒక్క భీమవరం టూటౌన్ కోసం ఐదుగురు పోటీలో ఉన్నారు. స్థానికంగా పేకాట, కోడిపందేలతో పాటు రోజువారీ ఆదాయ వనరులు అత్యధికంగా ఉండటం, ప్రభుత్వ వైన్ షాపులకు అనుబంధంగా బెల్టుషాపులు ఏర్పాటు చేయడం, ఇతర కారణాలతో డిమాండ్ కొనసాగుతోంది. ఎన్నికలకు ముందు ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతులు ఇచ్చి ఎన్నికల విధులు కేటాయించారు. తాజాగా ఐదు రోజుల క్రితం పోస్టింగులు మంజూరు చేశారు. ఈ క్రమంలో రెగ్యులర్ ఎస్సై, సీఐల బదిలీలకు రంగం సిద్ధమైంది.

శుభకరీ.. శాకంబరీ

మావుళ్లమ్మకు విశేష అలంకరణ



భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారికి ఆదివారం ఆషాఢ పౌర్ణమి సందర్భంగా శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి గణేష్ పర్యవేక్షణలో నాలుగున్నర టన్నుల కాయగూరలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించారు. ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ బ్రహ్మత్వంలో పూజాదికాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

నేటి మీకోసం రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ 'మీకోసం' రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అలాగే మండల, డివిజన్ స్థాయిలో జరగాల్సిన మీకోసం కార్యక్రమాన్ని కూడా రద్దు చేస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం కూడా సెలవు ప్రకటిస్తున్నట్టు చెప్పారు.

గోదావరి ఏటిగట్లపై నిఘా పెట్టాలి



కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్) : జిల్లాలో గోదావరి నదీ పరివాహక మండలాలు, లంక ప్రాంతాలైన నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, ఆచంట, పెనుగొండ మండలాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరదల రూపంలో జిల్లాకు ప్రమాదం వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. వరదను సమర్థంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేశామని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. తుపాను రక్షిత భవనాలు, ప్రభుత్వ భవనాలను సిద్ధం చేశామని, ముంపు ప్రజలు పునరావాస శిబిరాలకు రావాలన్నారు. గోదావరి పరివాహక ఏటిగట్లపై నిరంతర నిఘా పెట్టాలని, గట్టు బలహీనంగా ఉంటే యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. వర్షాల మూలంగా సంభవించే పరిస్థితులను అంచనా వేస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో లైజన్ అధికారిని నియమించాలని, మండల అధికారులు, సిబ్బంది ఆయా గ్రామాల్లో మకాం వేయాలన్నారు. వైద్యశిబిరాల ఏర్పాటు, పాము కాటు, కుక్క కాటు మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. షట్టర్లు, గేట్లు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల వంటి పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. బోట్స్‌మెన్ సొసైటీలు, మత్స్యకారులను అప్రమత్తం చేయాలన్నారు. సముద్రంలో ఎవరూ వేటకు వెళ్లవద్దన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను జిల్లాకు చేరుకోవాలని ఆదేశించామన్నారు. ముంపు ప్రాంతాల్లోని గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను సమీపంలోని ప్రభుత్వాస్పత్రుల్లో చేర్పించాలని అధికారులను ఆదేశించామని కలెక్టర్ చెప్పారు.



యలమంచిలి : కనకాయలంక కాజ్‌వేపైకి చేరిన వరద నీరు

నిలిచిన పంటు రాకపోకలు



నరసాపురం రేవులో నిలిచిన పంటు

నరసాపురం రూరల్: పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల ప్రజలు రాకపోకలు సాగించే నరసాపురం రేవు నుంచి పంటు ప్రయాణాన్ని నిలిపివేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరభద్రరావు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో నుంచి వరద నీరు గోదావరిలోకి వస్తుండటంతో నరసాపురంలో నీటిమట్టం పెరుగుతోందని, ఈ దృష్ట్యా పంటు ప్రయాణాన్ని నిలిపివేసినట్టు చెప్పారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలన్నారు.

● వీడని వరద ముంపు

జిల్లాలో ఎర్రకాలువ, వయ్యేరు కాలువ, యనమదుర్రు డ్రెయిన్లలో వరద ఉధృతి కొనసాగుతోంది. ఆయా పరీవాహక ప్రాంతాల్లోని పలు చోట్ల వరి చేలు ముంపులోనే ఉన్నాయి. అలాగే ఎగువ నుంచి వస్తున్న వరదతో గోదావరి నదిలో నీటిమట్టం పెరుగుతోంది. యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వేపైకి గోదావరి వరద చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



తాడేపల్లిగూడెం రూరల్ : మారంపల్లిలో వరద నీటిలో ఇళ్లు



పాలకోడేరు : మొగల్లులో నీటమునిగిన సబ్‌స్టేషన్



అత్తిలి : ఆరుదలకోడు స్లూయిజ్ వద్ద వేసిన ఇసుక బస్తాలు వేసిన దృశ్యం



తణుకు కల్చరల్ : తణుకు మండలం ముద్దాపురంలో ఎర్రకాలువ వరద ముంపులోనే చేలు

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన ప్రవేశాలు

- ఇంగ్లిష్ మీడియం తొలగిస్తారనే భయం
- గతేడాది కంటే 3 వేల మందికి పైగా విద్యార్థుల తగ్గుదల
- ఆంగ్ల మాధ్యమంపై గతంలో చంద్రబాబు అక్కసు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అనుమానాలు



భీమవరం పీఎస్ఎం పాఠశాలలో విద్యార్థినులు

భీమవరం : ప్రభుత్వ పాఠశాల్లో ఇంగ్లిష్ మీడియం తొలగించి కేవలం తెలుగు మీడియం మాత్రమే అమలుచేస్తారనే భయంతో సర్కారీ బడుల్లో విద్యార్థుల సంఖ్య ఈ విద్యా సంవత్సరంలో గణనీయంగా తగ్గింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడాన్ని గతంలో వ్యతిరేకించడంతో పాటు ఉపాధ్యాయ సంఘాలు కూడా తెలుగు మీడియం అమలు చేయాలని పట్టుబడుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ఉంటుందా.. లేదా.. అనే సందిగ్ధంలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు. దీంతో వారి పిల్లలను ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వంలో విద్యావిప్లవం తీసుకువచ్చారు. పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించేలా అమ్మఒడి అందించడంతో పాటు ఇంగ్లిష్ మీడియం విద్యను చేరువ చేశారు. అలాగే నాడు–నేడులో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దారు. విద్యాకానుక, డిజిటల్ విద్యాబోధన, ట్యాబ్‌ల పంపిణీ వంటి వినూత్న కార్యక్రమాలతో పిల్లలను బడిబాట పట్టించారు. మారుమూల గ్రామాల్లోని హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్ విద్యాబోధనను బాలికలకు చేరువ చేశారు. దీంతో పదో తరగతి తర్వాత చదువుకు స్వస్తి చెప్పిన వేలాది మంది బాలికలు ఇంటర్ విద్యను అభ్యసించారు.

1,350 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లాలో దాదాపు 1,853 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం సుమారు 2.21 లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారు. 1,350 సర్కారీ బడుల్లో గతేడాది సుమారు 1.05 లక్షల మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 1.02 లక్షల మంది మాత్రమే ఉన్నారు. ఇందుకు ఇంగ్లిష్ మీడియం తొలగిస్తారనేది ఒక కారణంగా చెబుతున్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని కొనసాగిస్తారా.. లేదా అనే సందిగ్ధత అంతటా నెలకొందని ఉపాధ్యాయులు అంటున్నారు.

క్లుప్తంగా

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

పాలకోడేరు: కోరుకొల్లు గ్రామానికి చెందిన యువతి(20) శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదంటూ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


శోభనసాయి కిషోర్ (ఫైల్)

యలమంచిలి: పాలకొల్లు–మార్టేరు రహదారి మార్గంలో శనివారం రాత్రి బ్రాడీపేట బైపాస్ రోడ్డు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అచ్చుగట్లపాలెంలో నివసించే యాదాల శోభన సాయికిషోర్(21) బ్రాడీపేట బైపాస్ రోడ్డు సెంటర్‌లో రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని తప్పించబోయి ఆగిఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన కిషోర్‌ను స్థానికులు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించేసరికి సాయికిషోర్ మృతిచెందాడు. సాయి కిషోర్ తండ్రి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ ఏసుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసు నమోదు


జంగారెడ్డిగూడెంలోని లోవరాజు ఇంట్లో చోరీ దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలోని త్రివేణి కళాశాల సమీపంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. రూ.2 లక్షల నగదు, 5 కాసుల బంగారం చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అడ్డూరి లోవరాజు వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. స్థానికంగా త్రివేణీ కళాశాల సమీపంలోని ఓ ఇంట్లో ఉంటున్నాడు. ఈ నెల 19వ తేదీన లోవరాజు తన భార్యతో కలిసి అపార్ట్‌మెంట్ వద్దకు కాపలా నిమిత్తం వెళ్లాడు. 20న రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు పగులగొట్టి, బీరువాలో ఉంచి రూ.2 లక్షలు నగదు, ఐదు కాసుల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించాడు. లోవరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమ్మె వాయిదా

ఏలూరు టౌన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులు, జీజీహెచ్ ఏలూరులో తలపెట్టిన సమ్మెను వాయిదా వేసినట్లు ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఈ నెల 22 నుంచి 29 వరకూ సమ్మె చేయాలని నిర్ణయించామని, భారీ వర్షాలు, వరదల కారణంగా వాయిదా వేశామని ఆయన తెలిపారు.

వర్షాలకు రొయ్య విలవిల

- మేత తినక చనిపోతున్న రొయ్యలు
- చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గడంతో తెగుళ్ల దాడి
- పట్టుబడులు పెరగడంతో తగ్గుతున్న ధర


రొయ్యల చెరువుల్లో ఏరియేటర్స్ తిప్పుతున్న దృశ్యం

భీమవరం: ఎడతెరపిలేని వర్షాలు ఆక్వా పరిశ్రమను నిలువునా ముంచేశాయి. ముఖ్యంగా రొయ్య రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వారం రోజులుగా ముసురు, భారీ వర్షాలకు చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గి రొయ్యలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. మేత తినక చనిపోతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 1.20 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. రొయ్యలకు వైట్‌గట్, వైరస్ వంటి తెగుళ్ల కారణంగా కౌంటు రాకముందే పట్టుబడులు పట్టాల్సి రావడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. పట్టుబడులు పెరగడంతో వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారని, దీంతో మరింత ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రొయ్య రైతులు నష్టాల పాలవకుండా తగు చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

- చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గకుండా నిత్యం ఏరియేటర్లు తిప్పాలి.
- విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఏరియేటర్లను వినియోగించుకునేందుకు జనరేటర్లు, ఆయిల్ ఇంజిన్లను సిద్ధం చేసుకోవాలి.
- రొయ్యల్లో ఆక్సిజన్ కొరత నివారణకు పొటాషియం పర్మాంగనేట్ పొడిని సిద్ధంగా ఉంచుకుని అవసరమైన మేరకు చెరువుల్లో చల్లాలి.
- వర్షం కారణంగా చెరువుల్లో నీటి మట్టం మరీ పెరగకుండా 50 సెంటీమీటర్ల లోతు వరకు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతున్నందున రొయ్యలు మేత సక్రమంగా తినే అవకాశం లేదు. దీంతో అవసరం మేరకు మాత్రమే మేతలు వేసి ఖర్చు తగ్గించుకోవాలి.
- చెరువు గట్లు పల్లంగా ఉన్న చోట గండ్లు పడకుండా పటిష్టం చేసుకోవాలి. గట్లు ఎత్తు తక్కువ ఉన్న చెరువుల్లో రొయ్యలు బయటకు వెళ్లకుండా వలలు ఏర్పాటు చేసుకోవాలి.

ప్రస్తుతం రొయ్యల ధరలు

కౌంట్		కిలో(రూ.లలో)
100	–	220
90	–	230
80	–	240
70	–	260
60	–	280
50	–	300
40	–	340
30	–	440

చేపలకు ఆక్సిజన్ కొరత

కొల్లేరు సరస్సుకు ఎగువ నుంచి నీటిని పంపించే గుండేరు, తమ్మిలేరు వాగులు పొంగిపొర్లుతున్నాయి. నీటి మట్టాలు పెరిగితే చేపల చెరువుల గట్లు కొట్టుకుపోయే అవకాశం ఉంది. ఆక్సిజన్ సమస్య ఏర్పడితే రాత్రి, తెల్లవారుజాము, ఉదయం సమయాల్లో చేపలు చనిపోతాయి. రోహు, కట్లలలో పెద్ద చేపలు ముందు చనిపోతాయి. చేప నీటి ఉపరితలంపై, గట్ల వద్ద నోటితో గాలి పీలుస్తాయి. మేత తినడం తగ్గిపోతుంది. నీరు ఆకుపచ్చ రంగుకు మారి, పులిసిన వాసన వస్తాయి. చేపలు నోరు తెరిచి చనిపోవడం, నలుపు వర్ణం కోల్పోయి తెల్లబడటం, శరీరం మెత్తబడడం జరుగుతుంది. చేప మొప్పలు ఎర్ర రంగుకి, తర్వాత లేత గులాబీ రంగుకు మారతాయి.

ఇవి పాటించాలి

- చేపల చెరువుల్లో మేత, సేంద్రీయ ఎరువులు మానేయాలి.
- చనిపోయిన చేపలను చెరువు నుంచి తొలగించాలి.
- కాల్షియం పెరాక్సైడ్ ఎకరానికి 1 నుంచి 2 కేజీలు, హైడ్రోజన్ పెరాక్సైడ్ 2 లీటర్లలో కలపి పిచికారీ చేయాలి.
- ఉదయం సమయంలో కార్బన్ డయాక్సైడ్ సాంద్రతను తగ్గించడానికి సున్నం ఎకరానికి 20–25 కేజీలు చల్లాలి.
- ఆక్సిజన్ లోటు నుంచి కోలుకున్న చేపలకు ప్రతి టన్ను మేతకు 10–15 కేజీల మినరల్ మిక్చర్ వరుసగా 15 –20 రోజులు పాటు అందించాలి.
- నీటిలో ఆమ్మోనియా ఉంటే యుక్కా పొడి 250–500 కేజీలు ఎకరానికి పిచికారి చేయాలి.

ఆక్సిజన్ కొరతతోనే తెగుళ్లు



గత 15 రోజులుగా వర్షాలు కురవడంతో రొయ్యల చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గి ఆక్సిజన్ కొరత ఏర్పడడంతో రొయ్యలకు వైట్‌గట్, వైరస్ వంటి వ్యాధులు సోకుతున్నాయి. దీంతో మేత సక్రమంగా తినకపోవడమేగాక తెగుళ్ల కారణంగా రొయ్యలు చనిపోతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ కౌంట్‌కు పట్టుబడులు పట్టడం వల్ల రొయ్యల ప్లాంట్ యజమానులు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల తీవ్రంగా నష్టపోతున్నాం.

– భోగిరెడ్డి శ్రీనివాసరావు, రొయ్యల రైతు, తోలేరు, వీరవాసరం మండలం

ముందస్తు చర్యలతో నష్ట నివారణ



భారీ వర్షాల కారణంగా రొయ్యలు, చేపల చెరువుల వద్ద రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే నష్టాలు తగ్గుతాయి. ప్రధానంగా ఆక్సిజన్ కొరత కారణంగా రొయ్యలకు ఇబ్బంది ఏర్పడుతుంది. అందువల్ల నిత్యం ఏరియేటర్లు తిరిగేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరం మేరకే మేత వేయాలి.

– ఎల్ఎల్ఎస్ రాజు, మత్స్యశాఖ ఇన్‌చార్జ్ ఏడీ, భీమవరం

బ్రావో బుక్‌లో బుడతడు


మెమొంటో, మెడల్‌తో నిరలాక్షరామ్

కొయ్యలగూడెం: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రధాన కేంద్రంగా పనిచేసే బ్రావో ఇంటర్నేషనల్ బుక్‌లో కొయ్యలగూడెంకు చెందిన మూడేళ్ల దాసరోజు నిరలాక్ష రామ్ స్థానం దక్కించుకున్నాడు. రాజమండ్రి బ్రావో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్లో నిర్వహించిన చిన్నారుల ప్రతిభ పోటీలలో రామ్ పాల్గొనట్లు తండ్రి బ్రహ్మశ్రీ డాక్టర్ దాసరోజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. సంస్కృత శ్లోకాలు అర్థాలతో సహా వివరించడం, పురాణాల సారాంశాన్ని పుక్కిట పట్టి, కొన్ని పురాణాలలోని కఠినతరమైన ప్రశ్నలకు తడుముకోకుండా సమాధానాలు, జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాడన్నారు. రామ్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఎంపిక అయ్యాడన్నారు. ఈ సందర్భంగా రామ్‌ను పలువురు అభినందించారు.

శ్రీవారి సేవలో మంత్రి కొండపల్లి


మంత్రి కొండపల్లికి స్వామి వారి మెమెంటో అందజేస్తున్న ఆలయ డీఈఓ బాబురావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.

10 కిలోల వెండి చోరీ


కైకలూరు ఎన్జీవోస్ కాలనీలో చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న సీఐ కృష్ణకుమార్

కైకలూరు: యజమాని కొన్ని నెలలుగా లేరనే విషయాన్ని తెలుసుకున్న దొంగలు తలుపులు పగలగొట్టి వెండి వస్తువులను చోరీ చేసిన ఘటన కైకలూరు ఎన్జీవోస్ కాలనీలో జరిగింది. న్యాయవాది పాలచర్ల సత్యనారాయణ చౌదరి ఈ ఏడాది మే 31న అమెరికాలో కూతురు వద్దకు వెళ్ళారు. రెండు రోజుల్లో కైకలూరు రావాల్సి ఉండగా ఇంటిని శుభ్రం చేసేందుకు పనివారిని పంపారు. ఆమె ఇంటికి వెళ్ళగా తలుపులు పగలగొట్టి ఉన్నాయి. వెంటనే సమీపంలో ఉంటున్న సోదరుడు శ్రీనివాసచౌదరికి తెలపగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కైకలూరు రూరల్ సర్కిల్ సీఐ బి.కృష్ణకుమార్, మండవల్లి ఎస్‌ఐ రామచంద్రరావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఏలూరు నుంచి క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు సేకరించారు. సుమారు 10 కేజీలు వెండి చోరీకి గురైనట్లు తెలుస్తోంది. పట్టణ ఎస్‌ఐ ఎంఆర్‌కే.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామను చంపిన అల్లుడు అరెస్ట్

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో మామను హత్య చేసిన అల్లుడిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. 24 గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేసిన భీమడోలు సీఐ బి.భీమేశ్వర రవికుమార్, ద్వారకాతిరుమల ఎస్‌ఐ జి.సతీష్‌ను ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ అభినందించారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఐఎస్ జగన్నాథపురానికి చెందిన పాతకోకల లాజర్(65) పెద్ద కుమార్తె గంగా భవానికి, మండలంలోని జి.కొత్తపల్లికి చెందిన తాపీమేస్త్రి కొక్కిరపాటి సుబ్బారావుకు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. భర్త మద్యానికి బానిసవడంతో గంగా భవాని ఏడాది క్రితం పుట్టింటికి వచ్చేసింది. రెండు నెలల క్రితం కుమార్తె స్వీటీకి వివాహం చేసింది. తనకు తెలియకుండా వివాహం చేయడంతో భార్యపై సుబ్బారావు కోపం పెంచుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా గంగా భవానీ కువైట్ వెళ్లేందుకు సిద్ధమవ్వగా.. భార్యను చంపాలని ఈనెల 19న అర్ధరాత్రి లాజర్ ఇంటికి వెళ్లాడు. అప్పటికే గంగా భవాని హైదరాబాద్‌కు పయనమైనట్లు తెలుసుకున్న సుబ్బారావు, భార్యను వెనక్కి రప్పించేందుకు మామ లాజర్‌ను తలపై కొట్టి హతమార్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సుబ్బారావును జి.కొత్తపల్లిలోని తన ఇంటి వద్ద ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు.

సంగీత దర్శకుడు సతీష్ మృతి


గడి సతీష్, సినీ సంగీత దర్శకుడు

ఉండి: తెలుగు, కన్నడ సినీ సంగీత దర్శకుడు గడి సతీష్(50) అనారోగ్యంతో కన్నుమూశారు. శనివారం గుండెపోటు రావడంతో ఇంటివద్దనే మృతిచెందారు. ఉండి మాజీ ఎంపీపీ గడి జయలక్ష్మి పెద్దకుమారుడైన సతీష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆర్కెస్ట్రా కళాకారుడిగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి కన్నడ సినీ పరిశ్రమలో సంగీత దర్శకుడిగా రాణించారు. మూడేళ్ళ క్రితం గుండెపోటు రావడంతో చికిత్స పొందారు. ఏడాది క్రితం మళ్ళీ గుండెపోటు రావడంతో బెంగళూరులో చికిత్స పొందుతూ 3 నెలలు కోమాలో ఉన్నారు. శనివారం స్కానింగ్ కోసం భీమవరం తీసుకెళ్లిన సమయంలో గుండెపోటు రావడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పగా.. వైద్యులు లాభం లేదని చెప్పడంతో ఇంటికి తీసుకువచ్చారు. శనివారం రాత్రి ఇంటివద్దే తుదిశ్వాస విడిచారు. 2001లో మణిశర్మ వద్ద సహాయకుడిగా చేరి కొంతకాలం పనిచేశారు. ఆర్పీ పట్నాయక్ బృందంలో ఎన్నో సినిమాలకు సహాయకుడిగా పనిచేశారు. కన్నడంలో పలు సినిమాలకు కీబోర్డు ప్లేయర్‌గా పనిచేశారు. దాదాపు 20 సినిమాలకు సంగీత దర్శకుడిగా పనిచేశారు.

చదరంగంతో మేధాశక్తికి పదును

భీమవరం: అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా, జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం నరసయ్య అగ్రహారంలోని ఏఆర్ఆర్ రెసిడెన్సీలో వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ ఫస్ట్ ర్యాంకింగ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. పోటీలను కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ సతీమణి ప్రవీణ ప్రారంభించి మాట్లాడారు. చదరంగం ద్వారా మేధాశక్తిని పెంపొందించుకుని బాల మేధావులుగా ఎదుగుతారని, దీనికి తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరమని అన్నారు. కార్యక్రమంలో మెంటే పార్థసారథి, చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తదితరులు మాట్లాడారు. పోటీలలో గెలుపొందిన కార్తిక్, ఎ.శరణ్, కుష్వంత్, ఎ.అంజలి, డి.భవిష్య, సాన్వి వాగ్దేవిలు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి శివరామరాజు పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌తో చర్మవ్యాధి నుంచి రక్షణ

నివారణకు టీకాల పంపిణీ


ముద్ద చర్మ వ్యాధి సోకిన పశువులు



జంగారెడ్డిగూడెం : పశువులకు వచ్చే ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్ డిజీస్) పాల ఉత్పత్తిపై అధిక ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధి సోకిన పశువుల చర్మంపై ముద్దలు, గడ్డలు ఏర్పడుతాయి. ఈ వ్యాధి వల్ల పశువులు చాలా ఇబ్బంది పడతాయి. వీటి నివారణకు ఈ నెల 20 నుంచి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ముద్దచర్మ వ్యాధి టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపనట్టింది. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని పశువులకు టీకాలు వేయించుకోవాలని జంగారెడ్డిగూడెం పశువైద్యాధికారి బీఆర్ శ్రీనివాసన్ తెలిపారు.

వ్యాధి లక్షణాలు

- పశువుల శరీరంపై చిన్న గడ్డలు, ముద్దలు ఏర్పడతాయి.
- పశువులకు అధిక జ్వరం వస్తుంది.
- పశువులు బలహీనంగా, అలసటగా కనిపిస్తాయి.
- పశువులు ఆహారం తీసుకోకపోవడం లేదా తక్కువగా తీసుకుంటాయి.
- ముద్ద చర్మ వ్యాధి సోకిన పశువులు తక్కువ పాలు ఇస్తాయి.

వ్యాధి వ్యాప్తి:

ముద్ద చర్మ వ్యాధి వైరస్ పశువుల నుంచి పశువులకు దోమలు, ఇతర కీటకాలు ద్వారా వ్యాపిస్తుంది. వ్యాధి ఉన్న పశువుల నుంచి ఇతర పశువులకు వ్యాపిస్తుంది.

నివారణ, చికిత్స

వ్యాక్సిన్ వలన ముద్ద చర్మ వ్యాధి నివారణ సాధ్యమవుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- పశువుల నివాస ప్రదేశాలను శుభ్రంగా ఉంచాలి.
- ముద్ద చర్మ వ్యాధి సోకిన పశువులను ఇతర పశువుల నుంచి వేరుగా ఉంచాలి.
- పశువులకు దోమల నుంచి రక్షణ కల్పించాలి.
- పశువులకు సమయానికి వ్యాక్సిన్ వేయించాలి
- ఏదైనా లక్షణాలు గమనిస్తే వెంటనే స్థానిక వెటర్నరీ వైద్యులను సంప్రదించాలి.

ప్రభుత్వ చర్యలు

భారతదేశంలో ప్రభుత్వం గోట్ పాక్స్ వైరస్ వ్యాక్సిన్‌ను అందిస్తూ ఉంది, ముద్ద చర్మ వ్యాధి నివారణ కోసం వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. సొసైటీల ద్వారా ప్రభుత్వ ఉచితంగా సేవలు అందిస్తోంది. అలాగే రైతులకు, పశువుల యజమానులకు ఈ వ్యాధి నివారణ, చికిత్స పట్ల అవగాహన కల్పిస్తోంది. ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి.

ముద్ద చర్మ వ్యాధి ప్రమాదకరం



ముద్ద చర్మవ్యాధి పశువులకు ప్రమాదకరం. సరైన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న గోట్ పాక్స్ వైరస్ వ్యాక్సిన్ వినియోగిస్తే, ఈ వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవచ్చు. ప్రతి రైతు పశువైద్యాధికారుల సలహాలు పాటించి తమ పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ఈ నెల 20వ తేదీ నుంచి పశువుల కోసం ముద్దచర్మ వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేస్తున్నాం.

– బీఆర్ శ్రీనివాసన్, పశువైద్యాధికారి

మీ మెదడు పదిలం

నేడు ప్రపంచ మెదడు దినోత్సవం



ఏలూరు (ఆర్ఆర్‌పేట): మనిషి శరీరంలో మెదడు ఒక అద్భుతమైన, శక్తివంతమైన భాగం.. మన మేధస్సుకు, ప్రశాంతతకు, మన భవితను నిర్ణయించే నిర్ణయాలు తీసుకోవడంలో మెదడు పాత్ర అత్యంత కీలకం. మన జీవితంలో ఎన్నో అద్భుతాలు చేసే మెదడును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అందుకే ఏటా జూలై 22వ వరల్డ్ బ్రెయిన్ (ప్రపంచ మెదడు దినోత్సవం)డేగా పాటిస్తున్నారు.

ఇటీవల కాలంలో మెదడుకు ప్రమాదకర వ్యాధుల తీవ్రత పెరిగింది. పక్షవాతం, మెదడులో ట్యూమర్లు, పార్కిన్సన్, యాంగ్జైటీ, డెమెన్షియా, డిప్రెషన్ వంటివి మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తలనొప్పి, వాంతులవడం, చూపులో తేడాలు, నడకలో తడబాటు, జ్ఞాపకశక్తి లోపించడం, ఏదైనా విషయాలపై ఏకాగ్రత చూపించలేకపోవడం, చెవిలో శబ్దాలు వినిపించడం, మనిషి అసాధారణంగా ప్రవర్తించడం లాంటి లక్షణాలు కనిపిస్తే మెదడుకు ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తాయనే విషయం గుర్తించాలి.

ఉమ్మడి జిల్లాలో రోజుకు 1000 మంది పేషెంట్లు

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా వంద కోట్ల మందికి పైగా మెదడు సమస్యలతో బాధపడుతున్నారు. జనాభాలో ప్రతి ముగ్గురిలో ఒకరు మెదడు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవిత కాలంలో ఒక్కసారైనా మెదడు సమస్యల బారిన పడుతున్నారు. ఏలూరు జీజీహెచ్ న్యూరాలజీ విభాగంలో రోజూ సుమారు 100 మంది, న్యూరో సర్జరీ విభాగంలో సుమారు 80 మంది వివిధ రకాల మెదడు సంబంధిత సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. ఆశ్రం ఆసుపత్రి, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో కలిపి మొత్తం మీద నిత్యం సుమారు 1000 మంది మెదడు సంబంధిత వ్యాధులకు చికిత్స నిమిత్తం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని అంచనా. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు 50 మంది న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు ఉన్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించే ఆధునిక పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

మెదడును చైతన్యంగా ఉంచుకోవాలి



మెదడును నిరంతరం చైతన్యంగా ఉంచుకోవాలి. ఫజిల్స్ పూర్తి చేయడం, నూతన విషయాలపై దృష్టి కేంద్రీకరించడం చేయాలి. ముఖ్యంగా మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలి. నిత్యం యోగా, ధ్యానం, శారీరక వ్యాయామం చేయాలి. ధూమపానం, మద్యపానాలకు దూరంగా ఉండాలి. బ్రెయిన్ సర్జరీల్లో ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. కీహోల్ సర్జరీ ద్వారా మెదడును పూర్తిగా ఓపెన్ చేయకుండానే శస్త్రచికిత్స చేయవచ్చు. న్యూరో నావిగేషన్ చికిత్సల ద్వారా అరుదైన ట్యూమర్‌లు సులువుగా తొలగించవచ్చు.

డాక్టర్ ఏ.హరికృష్ణ, నరాలు, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు, ఏలూరు

వరదముంపులో కనకాయలంక కాజ్ వే


కనకాయలంక వద్ద ముంపునకు గురైన కాజ్‌వే

యలమంచిలి: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 40 అడుగులకు చేరుకుంది. ధవళేశ్వరం నుంచి సుమారు 10 లక్షల క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి గోదావరిలో నీటిమట్టం భారీగా పెరిగింది. దీంతో కనకాయలంక వద్ద కాజ్‌వే పై వరదనీరు చేరుకుంది. ప్రజలు తమ దైనందిన అవసరాల కోసం వర దప్రవాహంలోనే ప్రయాణం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రికి మరింత వరద పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో వరదప్రభావిత గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటన

నరసాపురం డివిజన్‌లో 11 గ్రామాల్లో అత్యధికంగా వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించినట్లు ఆర్డీఓ ఎం.అచ్యుత అంబరీష్ చెప్పారు. ఈ గ్రామాల్లో వరదను సమర్థవంతంగా ఎదుర్కొంటామనీ, ఎలాంటి ప్రాణనష్టం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తహశీల్దార్ విజయశ్రీ తో కలసి ఆదివారం ఆయన బాడవ గ్రామంలో పర్యటించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆయన కోరారు.

యనమదుర్రు డ్రెయిన్ ఉగ్రరూపం

ముంపులో వేలాది ఎకరాల్లోని వరినాట్లు

అత్తిలి: యనమదుర్రు డ్రెయిన్ ఉగ్రరూపం దాల్చింది. గత నాలుగు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు యనమదుర్రు డ్రెయిన్‌లోకి భారీగా వచ్చి చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం రామచంద్రాపురం వద్ద ఉన్న ఆరుదలకోడు అవుట్ ఫాల్ స్లూయిజ్ వద్ద గట్లను తాకుతూ ప్రవహించడంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్లూయిజ్ వద్ద గట్టు బలహీనంగా ఉండటంతో అధికార యంత్రాంగం ఇప్పటికే ఇసుక బస్తాలతో పటిష్టం చేశారు. అయినప్పటికీ గట్టుపై బీటలువారడంతో ఏక్షణాన ఏమి జరుగుతోందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అత్తిలి మండలంలోని ప్రధాన డ్రెయిన్ అయిన రాచకోడు, ఈర్లకోడు, మంచిలి, ఆరుదలకోడు డ్రెయిన్‌ల ఉధృతికి వరినాట్లు, నారుమడులు నీటి ముంపులో ఉన్నాయి. ముఖ్యంగా అత్తిలి మండలం తిరుపతిపురం, వరిఘేడు, కొమ్మర, ఈడూరు, మంచిలి, అత్తిలి, స్కిన్నెరపురం ఆయకట్టు ప్రాంతం ముంపులో ఉంది. యనమదుర్రు డ్రెయిన్ ఉధృతి తగ్గే వరకు పంట చేలు ముంపులో ఉండే పరిస్థితి నెలకొంది. ఆరుదలకోడు అవుట్‌ఫాల్ స్లూయిజ్ గేట్లు మూసివేసినప్పటికీ గేట్లు సరిగ్గా పనిచేయకపోవడంతో యనమదుర్రు డ్రెయిన్ వరద నీరు ఆరుదలకోడు అవుట్ పాల్ స్లూయిజ్ గేట్ల కింద నుంచి వెనక్కి ఎగదన్నడంతో పంట చేలల్లోకి ఎర్రనీరు చేరి సముద్రాన్ని తలపిస్తోంది. ఎర్ర నీరు పంటచేలల్లోకి చేరడం వల్ల పంట పాడవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాదీ ఆరుదలకోడు అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద ఇదే సమస్య తలెత్తడంతో ముంపు సమస్య అధికమవుతుందన్నారు. స్లూయిజ్ గేట్లకు మరమ్మతులు చేపట్టి గేట్లు పూర్తిస్థాయిలో పడేవిధంగా సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఆరుదలకోడు అవుట్ ఫాల్ స్లూయిజ్‌వద్ద ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్



తిరుపతిపురంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఆరుదలకోడు డ్రెయిన్

వయ్యేరులో ఉధృతంగా వరద

తణుకు టౌన్: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా ఎర్ర కాలువ వరద నీరు తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామం వద్ద దువ్వ వయ్యేరులో చేరడంతో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఎర్ర కాలువ వరద నీరు ప్రవాహనం దువ్వ వయ్యేరులో చేరడంతో తణుకు మండలంలోని కోనాల, ముద్దాపురం, దువ్వ గ్రామాల్లోని పంట పొలాలు వరద నీటిలో మునిగిపోయాయి. ముఖ్యంగా కోనాల, ముద్దాపురం గ్రామాల్లోని ఎర్ర కాలువ వైపు పొలాలు ముంపుకు గురయ్యాయి. ఎర్ర కాలువకు ముద్దాపురం, కోనాల గ్రామాల వైపు ఉండే అవుట్ లెట్, ఇన్‌లెట్‌లను సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల ఆయా గ్రామాల్లోని వరి పంట నీట మునిగిందని, కనీసం ముందు జాగ్రత్త చర్యలు కూడా చేపట్టకపోవడం వల్లే ఇలా జరిగిందని రైతులు పేర్కొంటున్నారు. గతంలో కోనాల గ్రామం వద్ద ఎర్ర కాలువకు ఉన్న తూము తలుపులు తుప్పు పట్టి తెరుచుకోకపోవడంతో ఇక్కడ నుంచి నీరు లీకవకుండా ఆ ప్రాంతంలో ఇసుక బస్తాలను వేసి పూడ్చేవారని, అయితే ఈ సంవత్సరం అలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్ల ముద్దాపురం, కోనాల గ్రామాల్లోని పంట పొలాలు వరదనీటిలో మునిగిపోయాయని పేర్కొంటున్నారు. దీనితో పాటు దువ్వ వయ్యేరు అక్విడెక్ట్ వద్ద తూడు, గుర్రపు డెక్క అడ్డుగా నిలిచిపోయి నీటి ప్రవాహానికి అడ్డురావడంతో నీరు నిలిచిపోయి ఎగువన ఎర్ర కాలువ గట్లపైబడి వర నీరు ప్రవహించి పంట పొలాలను ముంచివేసిందని రైతులు వాపోతున్నారు. సకాలంలో వయ్యేరు, ఎర్రకాలువలో తూడు, గుర్రపు డెక్క తొలగిస్తే ఇప్పుడు వరద పరిస్థితుల్లో ఎంతో కొంత మెరుగ్గా ఉండేదని రైతులు పేర్కొంటున్నారు. వయ్యేరు వరద కారణంగా దువ్వ గ్రామంలోని పలు వీధుల్లో వరద నీరు చేరి జన జీవనానికి ఇబ్బందిగా మారింది. వయ్యేరు వరద కారణంగా వయ్యేరు ఏటు గట్టు నివాసం ఉంటున్న కుటుంబాలను గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. గ్రామంలో అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో మూడు చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

నిలకడగా ఎర్ర కాలువ వరద నీరు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నందమూరు అక్విడెక్ట్ వద్ద ఎర్ర కాలువ వరద స్థిరంగా కొనసాగుతుంది. ఆదివారం 39 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఎర్ర కాలువ పరివాహక గ్రామాలైన నందమూరు, మారంపల్లి, ఆరుళ్ల, మాధవరం, తదితర గ్రామాలు వరద నీటిలోనే ఉన్నాయి. కాగా, ఎగువన కొంగువారిగూడెం ప్రాజెక్టు నుంచి ఏడు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల్లో తాడేపల్లిగూడెంలో 11.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ మురళీకృష్ణ ఆదివారం తెలిపారు.



వరిఘేడులో చెరువును తలపిస్తున్న పంటపొలాలు



దువ్వ వయ్యేరు అక్విడెక్ట్ వద్ద తూడు, గుర్రపుడెక్క కారణంగా నిలిచిపోయిన వరద



వరద కారణంగా కోనాల గ్రామంలో నీట మునిగిన వరి పొలాలు

క్లుప్తంగా

పారుపల్లి అమ్మవారికి ఆషాఢం సారె



పారుపల్లి అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివస్తున్న భక్తులు

పెంటపాడు: జట్లపాలెం గ్రామ దేవత పారుపల్లి అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. గ్రామ ఆడపడుచులు ఊరేగింపుగా చలిమిడి, పానకాలతో ఊరేగింపుగా సారె, చీరలు కానుకలుగా తెచ్చారు. తీన్‌మార్ డప్పులు, బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుమారు 3 వేల మంది భక్తులకు అమ్మవారి అన్న ప్రసాద వితరణ చేశారు. కుదుళ్ల విజయమాలతి, మద్దింశెట్టి శేషుకుమారి, కుదుళ్లపోసిరత్నం, బండి శ్రీదేవి, పెనుబోతుల సోమాలమ్మ, అత్తిలి సుబ్బారావు, కసుకుర్తి శ్రీనివాస్, కోడూరి కాశీ, గొర్రిపాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నీటమునిగిన వరినాట్ల పరిశీలన



స్కిన్నెరపురంలో ముంపులో ఉన్న వరినాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర కిసాన్‌మోర్చా నాయకులు

అత్తిలి: వర్షాల వల్ల రష్టపోయిన రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని రాష్ట్ర కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షులు తోట గంగరాజు చెప్పారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామంలో ముంపులో ఉన్న వరి చేలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా గంగరాజు మాట్లాడు తూ వర్షాల కారణంగా వరినాట్లు, నారుమడులు పూర్తిగా పాడైపోవడంతో రైతులు పూర్తిగా నష్టపోయారని, నష్టపోయిన రైతులందరికీ న్యాయంచేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన మోర్చా అధ్యక్షులు దాసరి బాబ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, బీజేపీ మండల అధ్యక్షులు బాలం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు రైతులను ఆదుకోవాలి



నీట మునిగిన నారును చూపుతున్న రైతు సంఘం నాయకులు

పెంటపాడు: తుఫాను వలన దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని సీపీఎం, రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. జట్లపాలెం, మౌంజీపాడు, ఉమామహేశ్వరం, విప్పర్రు, పరిమెళ్ల ప్రాంతాలను పరిశీలించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చీర్ల పుల్లారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా సభ్యులు దానయ్య, తదితరులు మాట్లాడుతూ మునిగిన నీటిని బయటకు తోడేందుకు ఇంజన్లు, వాటికి డీజిల్ అందించాలన్నారు. నాట్లు మరలా వేసుకొనేందుకు నారు సరఫరా చేయాలని, విత్తనాలు, పురుగు మందులు, పెట్టుబడి సాయం అందించాలన్నారు. పెనగంటి దుర్గా, గోక భీముడు, నల్లమామిడి సత్యనారాయణ, కొమ్ము సురేష్, జాషువా, తాడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సంచార వైద్యశాల ద్వారా సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఇంటింటికి వైద్యసేవల కార్యక్రమంలో 9 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, పైడిపర్రు, కె.సావరం పరిసర గ్రామాల్లోని మంచం నుంచి లేవలేని వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సూచనలు, సలహాలు అందించారు. సంఘ సభ్యులు ఎం.రవి రిజనాల్డ్ ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నాదెళ్ల కృష్ణానందం తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్ కళాకేంద్రం సంగీత సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీవీఆర్ కళా కేంద్రం సంగీత సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో బుద్దాల వెంకట రామారావు పర్యవేక్షణలో ఆదివారం రాత్రి కళాకారులచే ట్రాక్ సింగింగ్, సాయి శృతిలయ మ్యూజిక్ స్కూల్ అమెరికా వారిచే శాస్త్రీయ సంగీత గానామృతం నిర్వహించారు. జంధ్యాల దివ్య, అద్విక్ సాయి, అక్షయ సాయిలకు సత్కారాలు నిర్వహించారు. వాసవి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ గ్రంథి సత్యనారాయణకు, నిడదవోలు ఎలక్ట్రికల్ డీఈఈ పాలాని ఉదయ భాస్కర్ శ్రీధర్‌కు కళా సేవ పురస్కారం, సీనియర్ కళాకారుడు ఎస్.రమణారావుకు ఆర్థిక సత్కారం చేశారు.

ముంపు బాధితులకు పరిహారం అందించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్ర కాలువ ముంపునకు గురైన రైతాంగానికి ఎకరాకు రూ.20 వేలు పరిహారం అందించాలని సీపీఎం జిల్లా నాయకుడు చింతకాయల బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని నందమూరు, మారంపల్లి, మాధవరం, జగన్నాథపురం గ్రామాల్లో సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందమూరులో 500 ఎకరాలు, జగన్నాథపురంలో 950 ఎకరాలు, మాధవరంలో 1200 ఎకరాలు ఎర్ర కాలువ ముంపునకు గురైనట్లు తెలిపారు. పంట నష్టం అంచనా వేసి వాస్తవ సాగుదారులకు పరిహారం ఇవ్వాలన్నారు. ఆకుమడులు వేసుకొనుటకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని కోరారు. ముంపు గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ముంపులో నిరాశ్రయులైన వారికి ఇల్లు మంజూరు చేయాలని కోరారు. సీపీఎం నాయకులు చిన్నం చిన్న, నాగేశ్వరరావు, కట్టా ప్రసాద్, మల్లుల పరమేశు, దితరులు పాల్గొన్నారు.



ముంపు గ్రామాల్లో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

ప్రజాహితం కోరుకునే వారే అఘోరీలు

తణుకు అర్బన్: భారతదేశంలో అఘోరీలంటే ప్రజాహితం కోరుకునే వారనే వాస్తవాన్ని సమాజానికి తెలియజెప్పిన గురువు అఖిల భారతీయ అఘోర్ అఖాడ అధ్యక్షుడు అఘోరేశ్వర్ భగవాన్ డాక్టర్ ఆదేష్‌నాథ్‌జీ అని అఖాడ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజేష్‌నాథ్‌జీ అఘోరీ అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం తణుకు కమ్మ కల్యాణ మండపంలో అఖిల భారతీయ అఘోర్ అఖాడ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అఘోరీలంటే జనం భయపడే పరిస్థితి ఉండేదని కానీ ఆ పరిస్థితిని రూపుమాపి గురువు స్థానంలో ఆదేశ్‌నాథ్‌జీ ధర్మం, సత్యం కోసం పాటుపడి సఫలీకృతమయ్యారని స్పష్టం చేశారు. ముందుగా గురువు ఆదేష్‌నాథ్‌జీ అఘోరీని పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం రాజేష్‌నాథ్‌జీ అఘోరీ ఆధ్వర్యంలో అఘోరీలు, భక్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భక్తులు అఘోరీల నుంచి ఆశీర్వచనాలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఎస్ఎస్ రెడ్డి (అబ్బు), తిర్రే విజయకృష్ణ, తిర్రే మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. గురుపూజోత్సవ కార్యక్రమానికి తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ హాజరై ఆదేష్‌నాథ్‌జీ అఘోరీ, రాజేష్‌నాథ్‌జీ అఘోరీల ఆశీర్వచనాలు తీసుకున్నారు.



తణుకులో అఘోరేశ్వర్ భగవాన్ ఆదేష్‌నాథ్‌జీ అఘోరీతో రాజేష్‌నాథ్‌జీ అఘోరీ

బాధితుడి కుటుంబానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

తణుకు: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు చిటికెల శ్రీను కుటుంబానికి మున్సిపల్ అధికారులు ఇచ్చిన హామీలు చిత్తశుద్ధితో అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ కోరారు. ఆదివారం సీఐటీయూ–ఏఐటీయూసీ సంఘాలు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని నిరసన తెలిపారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బీవీ రమణలతో కార్మిక సంఘాల నాయకులు పీవీ ప్రతాప్, బొద్దాని నాగరాజు, కామన మునిస్వామి చర్చలు జరిపారు. శ్రీను కుటుంబానికి మున్సిపల్ శాఖ నుంచి రూ. 5 లక్షలు, సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 5 లక్షలు, విద్యుత్ శాఖ నుంచి రూ.5 లక్షలు, తణుకు మున్సిపాల్టీ నుంచి రూ. 2 లక్షలు మొత్తం రూ.17 లక్షలు ఇవ్వడానికి అంగీకారం తెలిపారని చెప్పారు. అనంతరం మృతుడు శ్రీను భౌతిక కాయానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ టీడీపీ తరఫున రూ. 50 వేలు, మున్సిపల్ కమిషనర్ రూ. 15 వేలు చొప్పున శ్రీను భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.ఆదినారాయణబాబు, మందులయ్య, మంగ, అయ్యప్ప, దేవి, ధనలక్ష్మి, శ్రీను, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

తణుకు టౌన్: ఉన్నత చదువులు చదుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థినికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు తణుకు మానవత సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి తెలిపారు. ఆదివారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామానికి చెందిన యర్లా హర్షిణీ రాజ్‌కోట్‌లోని మార్వాడీ యూనివర్సిటీలో బీకాం డిజిటల్ ఫైనాన్స్ కోర్సులో మెరిట్ లిస్ట్‌లో సీటు సంపాదించి చదువుతున్నట్లు తెలిపారు. అయితే ఆర్థిక సిబ్బందుల కారణంగా సకాలంలో ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించిన మానవత సంస్థ రూ. 15 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, కేరీర్ గైడెన్స్ సెల్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.రాధాపుష్పావతి, కార్యదర్శి బి.రామకాశీ, కోశాధికారి అక్కిన కాశీ, జిల్లా కన్వీనర్ ఎస్‌వీ సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి చెక్కును అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

వైభవంగా వ్యాస పౌర్ణమి పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శంకరమఠంలో ఉమా చంద్రమౌళీశ్వర స్వామికి, సర్వ మంగళ అమ్మవారికి, ఆదిశంకరాచార్యులకు వ్యాస పౌర్ణమి పూజలు వైభవంగా నిర్వహించారు. బాల సుందర్ భాగవతార్ హరికథ గానం ఆలపించారు. మఠం సభ్యులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్రకాలువ ముంపు రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వంపై ఉందని, రైతులకు జరిగిన నష్టాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తామనడం సరికాదని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం మండలంలో ఎర్రకాలువ ముంపు గ్రామాలైన నందమూరు, కొత్తూరు, దండగర్ర, మాధవరం, అప్పారావుపేట, వీరంపాలెంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎర్ర కాలువ వరద పరిస్థితిని పరిశీలించారు. మాధవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నాడు మాధవరంలో బెడ్ విడ్త్ పెంచి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరు చేశామన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కొంగువారిగూడెం ప్రాజెక్టు నుంచి 17 వేల క్యూసెక్కులు, వాగులు, వంకల నుంచి మరో 10 నుంచి 12 వేల క్యూసెక్కులు వెరసి 30 వేల క్యూసెక్కుల నీరు ఎర్ర కాలువకు విడుదల చేశారన్నారు. ఈ వరదకు రైతులు నష్టపోతే ప్రభుత్వం నుంచి ఒక్కమాట మాట్లాడలేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, నారు, బీమా వంటివి అందిస్తామని స్థానిక ఎమ్మెల్యే ప్రకటన చేయలేకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో ఈ పరిస్థితి లేదన్నారు. రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ వర్తింపజేశామన్నారు. తమ ప్రభుత్వంలో నిజాయితీగా అర్హులకు పథకాలు అందించామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అదనంగా ఇస్తామని ఆశ చూపి కూటమి నాయకులు అధికారంలోకి వచ్చారన్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చే దిశగా పని చేయాలన్నారు. చేతకాని మాటలు మాట్లాడితే ఎవరూ ఊరుకోరన్నారు. గత ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హత కూటమి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. నాడు వైఎస్ జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేసిందన్నారు. నేటి కూటమి ప్రభుత్వం పింఛన్లు ఇచ్చి చేతులెత్తేసే పరిస్థితి నెలకొందన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ ఎప్పుడిస్తారు?

రైతాంగానికి పెట్టుబడి సాయం మేలో ముందుగా ఇవ్వాల్సి ఉందని, నేటికీ ఇవ్వలేదన్నారు. రైతు నిలబడితేనే ప్రభుత్వం ఉంటుందన్నారు. ముంపు రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ ఎప్పుడు ఇస్తారో స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. విధి విధానాల పేరుతో ఎగ్గొడతారా అని నిలదీశారు. రైతాంగానికి ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదుకోవాలన్నారు. తమ బాధ్యతలను మరిచిపోకుండా నిరుత్సాహ పడకుండా ప్రజల పక్షాన ఎలా నిలబడాలనే దానిపై ఆలోచన చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, రైతు సలహా మండలి మాజీ చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి, నాయకులు కర్రి భాస్కరరావు, చెన్నా జనార్ధనరావు, బండారు నాగు, కొలుకులూరి ధర్మరాజు, తదితరులు ఉన్నారు.



నందమూరు అక్విడెక్ట్ వద్ద ఎర్రకాలువ వరదను పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



మాధవరం వద్ద ఎర్ర కాలువను పరిశీలిస్తున్న కొట్టు సత్యనారాయణ

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో గురుపౌర్ణమి పురస్కరించుకొని షిరిడి సాయిబాబా ఆలయాలలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెంటపాడులో గురుపౌర్ణమి పురస్కరించుకొని ఊర చెరువు గట్టున వరసిద్ధి షిరిడి సాయిబాబా ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ సభ్యులు కొవ్వూరి లక్ష్మణరెడ్డి, నిముషకవి సూర్యనాగేశ్వరరావు, కర్రి భూపాల్‌రెడ్డి, కర్రి కనికిరెడ్డి, చీర్ల పల్లారెడ్డి, లచ్చిరెడ్డి సురేఖ, తదితరులు పాల్గొన్నారు. మండలంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

బాబా ఆశీర్వాదాలుండాలి:

గురుపౌర్ణమి పురస్కరించుకొని నియోజకవర్గంలో ప్రజలకు సాయిబాబా ఆశీర్వాదాలు మెండుగా ఉండాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పెంటపాడులో వరసిద్ధి షిరిడి సాయిబాబా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి, సూర్యనాగేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలు హర్షణీయం

తణుకు: పదేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు ఇమంది నాగకృష్ణంరాజు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఫార్మసీ చట్టం 1948 ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలు జరగాల్సి ఉండగా రాష్ట్రం విడిపోయిన తర్వాత మొట్టమొదటి సారిగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆషాఢ మాసం పౌర్ణమి సందర్భంగా ఆదివారం వాసవీ అమ్మవారి మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం సుగంధ ద్రవ్యాలతో, పసుపు కుంకుమలతో రజత వస్త్రాలంకరణ, విశేష పూజలు నిర్వహించారు.

నేడు మాజీ మంత్రి పర్యటన

పెంటపాడు: తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల పరిశీలన కోసం రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ దేవాదాయశాఖ మంత్రి సోమవారం మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షులు కైగాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రావిపాడు, కొండేపాడు, రామ చంద్రపురం, మీనవిల్లూరు, విప్పర్రు, యానాలపల్లి రైతులను రైతులను పరామర్శిస్తారన్నారు.